క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలే అమ్మాలి



కౌడిపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. మంగళవారం కౌడిపల్లిలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి, స్టాక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువుల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మొద్దని, నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని చెప్పారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు బిల్లు, విత్తన బస్తా, లాట్‌నంబర్, పంటకాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. దుకాణం వద్ద ధరల పట్టిక, స్టాక్ వివరాలు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, డీలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



యూత్ సభ్యులు అందజేసిన నోట్‌బుక్స్, పెన్సిళ్లతో చిన్నారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సర్వాన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, తేజశ్రీ, యూత్ అధ్యక్షుడు శ్యాం, యూత్ సభ్యులు మల్లేశం, మోహన్, భూమేష్, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో కిసాన్ సమ్మాన్ నిధి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): రైతుల ఖాతాల్లో ప్రధాని మోదీ డబ్బులను జమచేయడం గొప్పవిషయమని బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మూడోసారి మోదీ ప్రధానిగా పదవిని స్వీకరించగా.. మొదట రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం హర్షనీయమని తెలిపారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్‌రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు రమేశ్, చంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ ఆంజనేయులు ఉన్నారు.

నేడు నార్సింగిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి 11కేవీ ఫీడర్‌లో విద్యుత్‌లైన్‌లో ఆటంకం ఏర్పడకుండా బుధవారం చెట్లను కొట్టడం జరుగుతుందని నార్సింగి ట్రాన్స్‌కో ఏఈ స్వామి తెలిపారు. ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి, రామోజిపల్లి 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని కొత్తపేట, వీరోజిపల్లి, సంగారెడ్డిపేట, జూకల్, ముసాపేట, దానంపల్లి, శివాయిపల్లి, మాడ్చెట్‌పల్లి తదితర గ్రామాలతో పాటు తండాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

వరిగిన స్తంభాలతో ఇబ్బందులు



పొలంలో వరిగిన స్తంభం

నర్సాపూర్: కరెంట్ స్తంభాలు వంగి ఎప్పుడు పడిపోతాయోనని భయంగా ఉందని పలువురు రైతులు అన్నారు. నర్సాపూర్ పట్టణ పరిధిలోని వెల్దుర్తి మార్గం పక్కన ఉన్న పంట పొలాల్లో ఉన్న హైటెన్షన్, ఎల్ టెన్షన్‌లకు చెందిన కరెంట్ స్తంభాలు ఆరు నెలల క్రితం కొన్ని వంగాయని తెలిపారు. వాటిని సరి చేయాలని విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకపోయినా.. సరి చేయడం లేదని రైతులు చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరి చేయాలని వారు కోరుతున్నారు.

పూర్తయ్యేదెన్నడో?

- పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ భవనం
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు



జక్కపల్లిలో పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ భవనం

నర్సాపూర్ రూరల్: మండలంలోని జక్కపల్లి పంచాయతీ భవనం పిల్లర్ల స్థాయికే పరిమితమైంది. గతంలో జక్కపల్లి పంచాయతీ పరిధిలో మధిర గ్రామంగా ఉండేది.

2019లో జక్కపల్లిని ప్రత్యేక పంచాయతీగా అధికారులు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పంచాయతీ పాలకవర్గం బీసీ కమ్యూనిటీ హాల్‌లో పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. 2023లో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంచాయతీ భవన నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలు మంజూరు చేసి, పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చెప్పబడిన కాంట్రాక్టర్ పిల్లర్ల స్థాయి వరకు సుమారు రూ. 5 లక్షలు ఖర్చు పెట్టి నిర్మాణ పనులు ఆపేశాడు. పిల్లర్ల స్థాయి వరకు బిల్లులు వస్తే మిగతా పనులు చేస్తానని అంటున్నాడు. గత ఆరునెలల క్రితం పిల్లర్ల స్థాయి వరకు పనులు చేసి పీఆర్ అధికారులు బిల్లులు చేసిన డబ్బులు రావడం లేదని కాంట్రాక్టర్ తెలిపాడు. అంతకుముందు మన ఊరు - మనబడి ద్వారా పాఠశాలకు రూ.20 లక్షల ఖర్చు చేశానని ఆ డబ్బులు కూడా రాలేదని అందుకోసమే పంచాయతీ భవనం పనులు అసంపూర్తిగా వదిలేసినట్లు తెలిపాడు. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఆయా పనుల కోసం వచ్చే గ్రామస్తులు ప్రతీరోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇప్పించడంతో పాటు భవనం త్వరగా పూర్తిచేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ డీఈ రాధిక లక్ష్మిని వివరణ కోరగా... బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. బిల్లులు రాగానే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

సమస్య పరిష్కరించండి



అసంపూర్తిగా వదిలేసిన పంచాయతీ భవనాన్ని పూర్తిచేసి సమస్య పరిష్కరించాలి. పంచాయతీ కార్యాలయానికి వచ్చే గ్రామస్తులతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయించండి.

– మహేశ్‌గౌడ్, గ్రామస్తుడు

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామ పంచాయతీ వేతనాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు రావాల్సిన రెండు నెలల వేతనాలను రాష్ట ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరి వెంట స్వామి, అంజయ్య, బాలమణి, దేవమ్మ, మైసమ్మ, శోభ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికులు ఏడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రశ్నించారు. మంగళవారం ఆమె పంచాయతీ కార్మికులతో కలసి వెంటనే జీతాలు చెల్లించాలని, చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ వేతనంతో గ్రామ ప్రజలకు ప్రత్యేక సేవలు అందిస్తున్న కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సబిత, కార్మికులు, ప్రభాకర్, బందెల్లి, మల్లేశం, శేఖర్, యాదయ్య, భిక్షపతి, రాములు, బాలరాజు పాల్గొన్నారు.

కట్టు కాల్వ కబ్జా పరిశీలన



కట్టు కాల్వ కబ్జాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీప్యూటీ ఈఈ శ్రీకాంత్, సిబ్బంది

సాక్షి స్పందన

తూప్రాన్: కట్టు కల్వ కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ డీప్యూటీ ఈఈ శ్రీకాంత్ పేర్కొన్నారు. సాక్షి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన కట్టు కాల్వ కబ్జా కథనానికి స్పందించిన డీప్యూటీ ఈఈ శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి కిష్టాపూర్-వెంకటాయిపల్లి గ్రామాల మధ్యన ఉన్న కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాకు పాల్పడిన సదరు వ్యక్తులను హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, కాల్వలను కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే కాల్వలోని బండరాళ్లను, మట్టిని తొలగించాలని సూచించారు. సదరు వ్యక్తులు తొలగిస్తామని చెప్పారన్నారు. దీంతో సమీప రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ టీచర్లకు ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ మోడల్ స్కూల్‌లో మూడు గెస్ట్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో తెలుగు, హిందీ, గణితం బోధించేందుకు గెస్ట్ టీచర్లుగా అర్హత కల్గిన అభ్యర్థులు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 మధ్య నేరుగా హాజరుకావాలని కోరారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరై డెమో క్లాస్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

20న పెద్దశంకరంపేట మండల సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన చివరి మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

బీజేపీ నాయకులకు సన్మానం



కౌడిపల్లిలో బీజేపీ నాయకుడిని సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో బీజేపీ నాయకులను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సన్మానించారు. మంగళవారం సాయంత్రం మెదక్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎంపీ కౌడిపల్లికి చెందిన బీజేపీ మండల కార్యదర్శి కృష్ణ, వెల్మకన్నకు చెందిన ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌ను సన్మానించి అభినందించారు. కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేష్, రాజు, హరీశ్‌గౌడ్, సతీష్‌చారి, విష్ణు, ఆంజనేయులు, అఖిల్ పాల్గొన్నారు.

హరితహారం అందరి బాధ్యత



కొల్చారం కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ



పెద్దశంకరంపేటలో ..

పెద్దశంకరంపేట(మెదక్): హరితహారం అందరి బాధ్యత అని సీఎంఓ(జిల్లా మానిటరింగ్ అధికారి) సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశం, హెచ్‌ఎం విఠల్, చంద్రప్రకాష్, ఎంఐఎస్. సంపత్‌రెడ్డి న్నారు.

ప్రతీ ఇంటివద్ద మొక్కలు నాటాలి

చేగుంట(తూప్రాన్): ప్రతీ ఇంటివద్ద మొక్కలు నాటాలని వల్లభాపూర్ గ్రామ ప్రత్యేక అధికారి భూమేశ్ అన్నారు. మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో హరితహారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి భూమేశ్ , అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్యామల, హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సమత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దృష్టి పెట్టాలి

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాధికారి నీలకంఠ సూచించారు.మండలంలోని రాంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిని పరిశీలించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఎంఈఓ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులే తప్ప తులం బంగారం లేదు

నర్సాపూర్: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద బుధవారం చెక్కులు పంపిణీ చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వడం లేదు. రాష్ట మంత్రి కొండాసురేఖ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు నర్సాపూర్ మండలంలో 27మందికి, శివ్వంపేట మండలంలో 97మంది పంపిణీ చేసేందుకు అధికారులు, కాంగ్రెస్ నాయకులు నర్సాపూర్‌లో ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలప్పుడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద లబ్ధిదారులకు అప్పటి వరకు అందిస్తున్న రూ.ఒకలక్ష ఒక వెయ్యి 116 లతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాగా నగదుతో పాటు తులం బంగారం వస్తదని ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశ ఎదురుకానుంది. కొత్త పథకం ఇంకా ప్రారంభం కాలేదని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. లబ్ధిదారులకు రూ. ఒకలక్ష ఒకవేయి 116లతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు తయారు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు.

వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం

సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్



ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్

మెదక్ కలెక్టరేట్: సిమెంట్ వినియోగదారులకు భారతి సిమెంట్ ఆధ్వర్యంలో సాంకేతిక సాయం అందజేస్తామని సీనియర్ టెక్నికల్ సర్వీసెస్ శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మెదక్‌లోని రామలింగేశ్వర ఫర్టిలైజర్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రిలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు చెప్పారు. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 12 దేశాల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. భారతి సిమెంట్ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. భారతి సిమెంట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని పేర్కొన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలియచేశారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా మేస్త్రీలందరికి రూ.లక్ష ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ మార్కెటింగ్ సతీష్ కుమార్, డీలర్ లింగమూర్తి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



ఎంపీతో కొండాపూర్ గ్రామస్తులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ అభివృద్ధికి పాటుపడుతున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నర్సింగరావు, నాగరాజు, ఆంజనేయులు, బాబు, వెంకట్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, నాయకులు మల్లేశ్, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్

బీజేపీ జిల్లా నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): మెదక్‌లో ఇటీవల జరిగిన సంఘటన విషయమై అధికార కాంగ్రెస్ నాయకులు మెజార్టీ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. పార్టీ జిల్లా నాయకులు శంకర్‌గౌడ్, నవాత్ రాజేంద్రప్రసాద్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. గోరక్షణ విషయమై అధికార పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వ హాయంలో గోవులకు రక్షణ కరువైందని ఆరోపించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించే వారికి పుట్టగతులుండవని హెచ్చరించారు. పంజా విజయకుమార్‌ను కాంగ్రెస్ టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ నాయకులు కొడపర్తి నరేందర్, ఎల్లంగౌడ్, దామోదర్‌రావు, కార్తీక్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు



చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సుధారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని సోమక్కపేట్ గ్రామ శివారు నుంచి సోమవారం రాత్రి జోగిపేటకు వదించేందుకు అక్రమంగా గోవులను తరలించే సమయంలో బీజేపీ నాయకులు అడ్డుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం విధితమే. కాగా మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇచ్చిన ఫిర్యాదుతో అక్రమంగా గోవులను తరలిస్తున్న జోగిపేటకు చెందిన మహ్మద్ అక్బర్, చిలప్‌చెడ్‌కు చెందిన మన్నె దశరథ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ గౌడ్, అశోక్, బీజేపీ నాయకులు రాజు, సంతోష్, దశరథ్, మురళి పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

తూప్రాన్: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. మండల పరిషత్ కార్యాయంలో ఎంపీపీ స్వప్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులతో చర్చించారు. గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శరణ్యరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్‌ను విమర్శించడం సరికాదు

నిజాంపేట కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంపేట(మెదక్): కొన్ని రోజుల క్రితం మెదక్‌లో జరిగిన రెండు వర్గాల మధ్య ఘర్షణకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని నిజాంపేట కాంగ్రెస్ మండల నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. మెదక్‌లో జరిగిన రెండు వర్గాల మధ్య ఘర్షణకు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, నాయకులు మహేందర్, మారుతి, నసీరుద్దీన్, తాజా మాజీ సర్పంచ్‌లు అమరసేనారెడ్డి, నర్సింహరెడ్డి, సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను విడుదల చేయాలి



పాపన్నపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పాపన్నపేట(మెదక్): మెదక్ పట్టణంలో అక్రమంగా అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఉప తహసీల్దార్ విజయలక్ష్మికి బీజేపీ మండలాధ్యక్షుడు రాములు వినతిపత్రం అందించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌లు ఏకపక్షంగా వ్యవహరించడంపై మండపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దుర్గప్రసాద్, బాగేష్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి నగేష్, పట్టణాధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు చంద్రశేఖర్, లక్ష్మణ్, దుర్గయ్య, మల్లేశం, విఠల్, వెంకట్, శ్రావణ్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

జెడ్పీటీసీ యాదగిరి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ యాదగిరి

రేగోడ్(మెదక్): సిందోల్ గ్రామంలో కొన్నిచోట్ల ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ యాదగిరి పేర్కొన్నారు. రేగోడ్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నీటి సమస్యను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో నిర్మించిన చెక్ డ్యాంలు మట్టితో నిడిపోయాయని, నీళ్ల నిల్వ ఉండడం లేదన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని ఖాళీలు ఉన్నాయని మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా ప్రశ్నించారు. ఏవో జావిద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కిసాన్ సామాన్ నిధి కి 301 మంది రైతులు ఈకేవైసీ చేసుకోవాల్సింది ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వినీల, ఎంపీటీసీలు నర్సింలు, నాగిరెడ్డి, ఎంపీడీఓ సీతారావమ్మ, పశు వైద్య శాఖ సిబ్బంది ధర్మచందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏపీవో జగన్మోహన్ సింగ్, ఈసీ జగదీష్, సీసీ అనసూయ, ఎంఆర్సి ఆపరేటర్ సిద్ధూ, విద్యుత్ శాఖ సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.